క్లుప్తంగా

మైనింగ్‌పై కేరళ విద్యార్థులకు అవగాహన



గనులను పరిశీలిస్తున్న విద్యార్థులు

సైదాపురం: మండలంలో ఉన్న మైకా పరిశ్రమలపై కేరళ రాష్ట్రం కొచ్చికోడ్ జిల్లాలోని ఫరూఖ్ కాలేజీకి చెందిన జియాలజికల్ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. జియాలాజికల్ ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఆ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు మండలంలోని రామసాగరం, సైదాపురం, ఊటుకూరు, కలిచేడు, అనంతమడుగు గ్రామాల్లో ఉన్న మైకా, ఫల్సఫర్ క్వార్జ్ గనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖనిజాలకు సంబంధించి విద్యార్థులకు మైన్ యాజమాన మాగుంట రాహుల్ సేన్‌రెడ్డి అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

పెళ్లకూరు: నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించి, అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీధిదీపాలు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ తీర్మానాలను దశల వారీగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా గురునాథస్వామి గ్రామోత్సవం



ఊరేగుతున్న గురునాథస్వామి

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో గురునాథస్వామి గ్రామోత్సవం గురువారం వైభవంగా ప్రారంభించారు. తొలి రోజున తూర్పుకనుపూరు, ఈదులవారిపాళెంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఇంటా స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మాజీ చైర్మన్ సీ మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు డీ చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ పోసినవారిపాళెం, కొమరావారిపాళెం, రావులవారిపాళెంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించి చివరి రోజున తూర్పుకనుపూరులో నిమ్మజ్జనం చేస్తారని చెప్పారు.

గౌరమ్మకు ప్రత్యేక పూజలు



గౌరమ్మను ఊరేగిస్తున్న గిరిజనులు

గూడూరురూరల్: మండలంలోని చెన్నూరులోని గిరిజన కాలనీలో గురువారం గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు గొబ్బి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఆ తరువాత గౌరమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామానికి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

పేలిన గ్యాస్ సిలిండర్.. త్రుటిలో తప్పిన ప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గూడూరురూరల్: మండలంలోని షిరిడీ సాయి బాబా మందిరం సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వాచ్‌మన్ గదిలో సిలిండర్ పేలింది. అయితే వాచ్‌మన్ అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు కథనం మేరకు.. పెట్రోల్ బంక్‌లో ఆవరణలోని ఓ గదిలో వాచ్‌మెన్ ఉంటున్నాడు. గురువారం రాత్రి అతడు వంట చేసేందుకు ఉపక్రమించగా ఆ సమయంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ఎదురుగా ఉన్న రోడ్డుపైకి సిలిండర్‌ను తరలించి, అగ్నిమాక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాక సిబ్బంది అక్కడికి చేరుకుని, మంటలు అదుపు చేస్తుండగానే సిలిండర్ పేలి పోయింది. దీంతో అటుగా రాక పోకలు సాగించే వారు భయాందోళనతో పరుగులు తీశారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రం సుభిక్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నది తీరంలో జరుగుతున్న ఏటి పండుగ ముగింపు ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ సమేతంగా ఏటి పండుగను సందడిగా జరుపుకోవడం శుభపరిణామమన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమేనని అభిప్రాయపడ్డారు. చిన్నారులు విద్యావంతులుగా ఎదగాలన్నా, రాష్ట్రంలోని రైతులు పండుగ చేసుకోవాలన్నా మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, జగన్‌మోహన్ రెడ్డే సీఎం కావాలని చెప్పారు. ప్రజలందరూ ఆయన్ని ఆదరించాలన్నారు. అన్ని వర్గాలు, కులాలు, మతాలకతీతంగా పండుగ చేసుకుంటున్నారంటే గడిచిన ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే కారణమన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలు వంద శాతం పూర్తి చేసిన ఘనత జగనన్నదేనన్నారు. అనంతరం ఏటి పండుగ ముగింపు రోజు జబర్దస్త్, మిమిక్రీ, యాంకర్ కావ్య, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను అలరించారు. అనంతరం నిర్వహించిన కేరళ కాంతార చిత్రలహరి ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. స్వర్ణముఖి నది తీరంలో స్థానికులు డ్యాన్సులు, చిందులు వేసి, హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, కే రాజారెడ్డి, వైస్ చైర్మన్ జే వెంకటకృష్ణారెడ్డి, జీ సిద్దయ్య, కే మాధవరెడ్డి, సీ కుమార్, ఓ కిషోర్‌యాదవ్, పీ హరిరెడ్డి, కే జయరామయ్య, జీ భరత్, కౌన్సిలర్లు డీ రవి, పీ నాగార్జున, అశోక్‌కుమార్, టీ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



పాటకచేరి చేస్తున్న కళాకారులు



చిన్నారుల ఆట, పాట



విచిత్ర వేషధారణలో అలరిస్తున్న కళాకారుడు



ఏటి పండుగకు హాజరైన జనం



స్వర్ణముఖినది తీరంలో చిందులు వేస్తున్న ప్రజలు

జగనన్న అంటేనే జనానికి ఓ నమ్మకం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే జనానికి ఓ నమ్మకమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 8వ వార్డు ఏపీటీఏఫ్ కాలనీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆ ప్రాంతానికి విచ్చేసిన నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందన్న విషయం వివరించి, సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు చేశారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, విప్ లక్ష్మి, కౌన్సిలర్ వహిద, ప్రభావతి, నేతలు జే కామాక్షి, సురేష్, ఏ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లితో ఆర్డీఓ భేటీ

వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ గురువారం నేదురుమల్లి నివాసంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ నేదురుమల్లికి పుష్పగుచ్ఛం అందజేసి, ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

30లోపు టిడ్కో గృహాల పంపిణీకి సన్నద్ధం

సైదాపురం(వెంకటగిరి): వెంకటగిరిలో నిర్మిస్తున్న టిడ్కో గృహాల నిర్మాణం త్వరగా పూర్తి చేసి, ఈ నెల 30వ తేదీలోపు పంపిణీకి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. నేదురుమల్లి నివాసంలో గురువారం టిడ్కో, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించి, గృహాలను సిద్ధం చేయాలన్నారు. గృహాల పంపిణీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రులు హాజరు కానున్నట్లు తెలిపారు.

క్రికెట్ విజేత అల్లీపురం జట్టు



నగదు బహుమతి అందజేస్తున్న నాగరాజు

చిల్లకూరు: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని ఏరూరులో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో అల్లీపురం జట్టు విజేతగా నిలిచింది. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఏరూరు గ్రామానికి చెందిన చిల్లకూరు పీఏసీఎస్ చైర్మన్ సీ నాగరాజు తండ్రి చెంచురామయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీల్లో ఆరు జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో ఏరూరు పుట్టయ్య జట్టు, అల్లీపురం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన పుట్టయ్య జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 76 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన అల్లీపురం జట్టు 11 ఓవర్లల్లో 7 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసి విజేతగా నిలిచింది. దీంతో విజేత జట్టుకు చేవూరు నాగరాజు చేతుల మీదుగా రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన పుట్టయ్య జట్టుకు రూ 5 వేలు, మూడో స్థానంలో నిలిచిన కావలిపాళెం జట్టుకు రూ 3 వేలు నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఆరోగ్యాన్ని రక్షించుకుంటూ ఉన్నత చదువులు చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసంత్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోయి రావమ్మ.. గౌరమ్మ



దక్కిలి: గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

దక్కిలి: పోయి రావమ్మా.. గౌరమ్మా అంటూ గొబ్బిపాటలు పాడుతూ గౌరమ్మను గురువారం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మండలంలోని దగ్గవోలు, భీమవరం, పాతనాలపాడు (కమ్మవారిపల్లె), చాపలపల్లె, సంగనపల్లె తదితర గ్రామాల్లో గొబ్బెమ్మ పండగను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. కుమ్మరింట చేసిన గౌరీదేవి ప్రతిమను గ్రామంలో ఏర్పాటు చేసిన వేపాకుల మండపంలో కొలువుదీర్చి పూజలు చేశారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. తరువాత గొబ్బెమ్మను మేళతాళాల నడుమ గ్రామ చావిడి వద్ద నిలిపి పాటలు పాడుతూ సందడి చేశారు. గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

వైభవంగా గొబ్బెమ్మ వేడుకలు

వాకాడు: మండలకేంద్రంలో బీసీ కాలనీ వాసులు గొబ్బెమ్మ వేడుకలు, గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీలో గిరిజనులు గొబ్బెమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి మూడు రోజులుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, జానపద నృత్యాలు నిర్వహించారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

దక్కిలి (బాలాయపల్లె): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి దేవికా చౌదరి అన్నారు. బాలాయపల్లెలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. రాజకీయాలు గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుటుందని హెచ్చరించారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

రాపూరు: మండలంలోని సంక్రాంతిపల్లెలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పీ మధుసూదన్‌రెడ్డి గార్డెన్స్‌లో జరగనున్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ తిరుపతి అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ విషయాలను చర్చిస్తారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేస్తం మరిచిపోలేని బంధం



బహుమతి అందజేస్తున్న అధికారులు

గూడూరురూరల్: నేస్తం మరిపోలేని బంధం అని, జీవితంలో ప్రతి ఒక్కరికి మంచి స్నేహితులుంటే ఆపద సమయంలో ఆదుకుంటారని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సంక్రాంతిని సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీసులు, మీడియా సభ్యులు, వివిధ శాఖల్లో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గూడూరు పట్టణంలోని ప్రతి ఒక్కరిని కలుపుకుని ఇలా ఆటలు ఆడించి, ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని నింపడం ఆనందంగా ఉందన్నారు. రవాణాశాఖాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ చిన్నతనం నుంచి స్నేహితులుగా ఉన్న వారు కొందరైతే, మరి కొందరు పాఠశాల స్థాయి నుంచి స్నేహితులుగా ఉంటారని, వారు జీవిత కాలం వరకు విడి పోకుండా ఉండే అవకాశం ఉందన్నారు. విజేతగా నిలిచిన బెస్ట్ ఫ్రెండ్స్ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన పోలీస్ జట్టుకు బహుమతులు అందజేశారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా



వాలీబాల్ విజేత తనియాలి జట్టు



సైదాపురం: విజయం సాధించిన వేములచేడు జట్టు

దొరవారిసత్రం: మండలంలోని కల్లూరులో మండల స్థాయి ఆడుదాం... ఆంధ్ర పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం మండల స్థాయిలో వాలీబాల్ పోటీల్లో తనియాలి జట్టు కల్లూరు జట్టుపై విజయం సాధించింది. అలాగే క్రికెట్ పోటీల్లో పూలతోట జట్టుపై కల్లూరు జట్టు విజయం సాధించిందని ఈఓపీఆర్డీ మధు తెలిపారు. కబడ్డీ పోటీల్లో ఏకొల్లు జట్టు మండల స్థాయిలో విజయం సాధించి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. మండల స్థాయిలో విజయం సాధించిన జట్లు సూళ్లూరుపేటలో త్వర లో నియోజకవర్గంస్థాయిపోటీల్లోపాల్గొంటాయన్నారు.

హోరాహోరీ క్రికెట్ పోటీలు

సైదాపురం: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా గురువారం సైదాపురం ఉన్నత పాఠశాలల్లో జరిగిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మండలస్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులుగా రాణించాలని కోరారు. వేములచేడు, తోకలపూడి సచివాలయాల పరిధిలో ఫైనల్స్ హోరీహోరీగా జరిగాయి. వేములచేడు జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దయాకర్, పీడీ కోటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ఆగిన భవన నిర్మాణాలు



వేణుంబాకంలో గోడలకే పరిమితమైన ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, సచివాలయ భవనాలు

దొరవారిసత్రం: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పలు భవనాల నిర్మాణం ఆగిపోయింది. ఫలితంగా ప్రజలకు అద్దె భవనాల్లోనే సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం కేంద్రాల్లోనే పలు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్లు అప్పగించి విషయం తెలిసిందే. దొరవారిసత్రం మండలంలో 11 సచివాలయాలున్నాయి. ఈ భవనాల పనులు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు భవనం పనులు ప్రారంభించి, పూర్తి చేయకుండానే వదిలేయడంతో పలు చోట్ల సచివాలయ భవనాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్బీకే భవనాల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ పనులు పూర్తి చేసేందుకు ఆయా శాఖ అధికారులు కాంట్రాక్టర్ల వెంట పడుతున్న పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. వేణుంబాకం, ఏకొల్లు, కల్లూరు, మీజూరు, తల్లంపాడు, ఉచ్చూరు, కొత్తపల్లి గ్రామ సచివాలయాల్లో అన్ని శాఖల భవనాలు శ్లాబ్ స్థాయిలో, పునాదులకే పరిమితం కావడంతో పిచ్చిమొక్కలతో నిండి పోయి దర్శనమిస్తున్నాయి.

కండలేరులో 12.521 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 12.521 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకాలువకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతను నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కానూరులో నేడు జగనన్న సురక్ష

పెళ్లకూరు: మండలంలోని కానూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. కానూరు పరిసర గ్రామాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరురూరల్: స్థానిక ఐటీఐలో డివిజన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కళాశాల డైరెక్టర్ నాగరాజు అన్నారు. ఐటీఐ కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌసల్ వికాస్ యోజన 4.0 ద్వారా నిరుద్యోగులకు వివిధ రకాల పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించడానికి శిక్షణ ఇస్తున్నామన్నారు. అసోసియేట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 94925 78238, 86398 35953, 94401 68907 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా సామూహిక పొంగళ్లు

చిట్టమూరు: మండలంలోని ఆరూరు గ్రామదేవత ఎల్లమ్మకు వైఎస్సార్ సీపీ నాయకుడు డీ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక పొంగళ్లు ఘనంగా పెట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు అమ్మవారికి చద్దిని తీసుకుని వచ్చి పూజలు చేశారు. అనంతరం బోనాలు తీసుకువచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. రాత్రి అమ్మవారికి విశేషాలంకరణ చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీ సురేంద్రరెడ్డి, సుదర్శనరెడ్డి, పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంస్కృతికి నెలవు సంక్రాంతి

కోట: సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు అని, పల్లెలో ఈ పండుగ కళను ఎన్నటికీ మరచి పోలేమని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కే ధనుంజయరెడ్డి అన్నారు. మండలంలోని ఊనుగుంటపాళెంలో గురువారం జరిగిన గొబ్బెమ్మ నిమ్మజనంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పాత వాటిని దూరం చేస్తూ కొత్త వాటికి ఆహ్వానం పలికే పండుగ అన్నారు. గిరిజన కాలనీలు, దళితవాడల్లో గౌరమ్మ (గొబ్బెమ్మ)ల ఊరేగింపు, నిమ్మ జనం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కోట ఎంపీపీ అంజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, ఊనుగుంటపాళెం సొసైటీ చైర్మన్ హనుమంతరెడ్డి, సర్పంచ్ చెంగయ్య, సీ నాగేశ్వరరావు, కోటారెడ్డి, పీ నారాయణ, శివరామ్‌నాయుడు, నాగూరు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.